క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

కుంటాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు కుంటాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ రహీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి'



కండువా కప్పుతున్న నారాయణ్‌రావు పటేల్

భైంసాటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నివర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. లోకేశ్వరం మండలం సేవాలాల్ తండా, పుస్పూర్ తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం భైంసాలోని తన నివాసంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లోకేశ్వరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, ఆడే సాయినాథ్ తదితరులు ఉన్నారు.

వసతుల కల్పనకు కృషి



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని సెక్టోరియల్ అధికారి సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అందాకూర్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మండల వ్యాప్తంగా 23 పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించి నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. వారి వెంట రూట్ నెంబర్10 అధికారి మధు, రూట్ ఆఫీసర్ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రమ్య తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలోని ఇన్‌కరిగూడ, చందునాయక్‌తండాలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేంద్రాల నిర్వహణతోపాటు రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని సూచించారు. సిబ్బంది అనసూయ, సునీత, శోభ, అమృత తదితరులు ఉన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీగిరి క్షేత్రంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నూతన ఆలయం కావడంతో పట్టణంతోపాటు, చుట్టు పక్కల ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. కుజదోష, సర్ప దోష, రాహుకాల దోషాలు తొలగిపోవాలని పూజలు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులకు రాకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వరి పంట పరిశీలన



రైతుతో మాట్లాడుతున్న ఏఈఓ అంబాజీ

సోన్: పంటల సాగులో రసాయనాల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని ఏఈవో అంబాజీ అన్నారు. మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో భూసారం పెరిగి నత్రజని, భాస్వరం, పొటాష్, కాల్షియం, మెగ్నీషియం, జింకు, రాగి వంటి పోషకాలు మొక్కలకు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం జీవామృతం తయారీపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతులు ఎలుగు చిన్నభూమన్న, దశరథ్ తదితరులు ఉన్నారు.

కుట్టుమిషన్, ఏసీ మెకానిక్ శిక్షణపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్)లో మంగళవారం నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్, ఏసీ మెకానిక్ శిక్షణపై యువకులు, మహిళలకు సంస్థ బ్లాక్ మేనేజర్ మాలావత్ గణేశ్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గురువారం బావాపూర్(ఆర్)లో కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో ఏసీ మెకానిక్ శిక్షణ కూడా ప్రారంభమవుతుందని.. ఆసక్తి కల్గినవారు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ..!

- ముథోల్‌లో రెండేళ్లుగా సాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు
- నిధులు రాక.. పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



ముథోల్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం



పిల్లర్ల దశకే పరిమితమైన ఆసుపత్రి భవన నిర్మాణం

ముథోల్: నాలుగు దశాబ్దాల కిందట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. మరోవైపు సౌకర్యాలు లేక.. మెరుగైన వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గత ప్రభుత్వం మార్చి, 2022లో రూ.8.50 కోట్లతో ముథోల్ అంబేద్కర్ చౌరస్తా సమీపంలో భైంసా–బాసర జాతీయ రహదారి పక్కన నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులను ప్రారంభించింది. కానీ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్లు వేసి వదిలేశారు.

పేరుకే ఆసుపత్రి..

సామాజిక ఆరోగ్య కేంద్ర పాతభవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. కానీ నిధులు రాలేదనే కారణంగా సంబంధిత కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. ఇప్పటికీ గ్రామంలో ఉన్న ఆసుపత్రిలో నామమాత్రపు సేవలే అందుతున్నాయి. ఆపరేషన్లు జరగడం లేదు.. పేరుకు 30పడకల ఆసుపత్రి అయినప్పటికీ సౌకర్యాల్లేక మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. ఆపరేషన్లు కాని, పోస్టుమార్టం కాని ఇక్కడ నిర్వహించడం లేదు. వసతుల్లేవనే కారణంతో ఏ చిన్న వైద్యానికి అయినా భైంసా ఆసుపత్రికి తరలిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

పిల్లర్లు వేసి వదిలేశారు..

త్వరలో ఆసుపత్రి భవనం పూర్తయి మెరుగైన వైద్య సేవలు అందుతాయనుకున్న ముథోల్ మండలంలోపాటు తానూరు, బాసర మండలాల ప్రజలకు నిరాశే మిగులుతోంది. నిధులు మంజూరు కాలేదనే కారణంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పిల్లర్ల దశలోనే వదిలేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి త్వరగా ఆసుపత్రి భవన నిర్మాణం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ఇటీవల భైంసాలో మంత్రి సీతక్కకు, కలెక్టర్‌కు ముథోల్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

నిర్మాణం పూర్తయితే..

ప్రస్తుతం ముగ్గురు వైద్యులు, ఐదుగురు స్టాఫ్‌నర్సులు, ఐదుగురు ఏఎన్ఎంలు పనిచేస్తున్నారు. ఒక డాక్టర్ కేవలం ప్రతి గురువారం మాత్రమే ఆసుపత్రికి వచ్చి విధులు నిర్వర్తిస్తాడు. కొత్త ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే డాక్టర్లతోపాటు సిబ్బంది కూడా పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి.

పనులు పూర్తి చేయించాలి



ముథోల్‌లో ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. పాత భవనంలో నామమాత్రంగానే వైద్యసేవలు అందుతున్నాయి. కొత్త భవనం పూర్తయితే చుట్టూ పక్కల మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

– సునీల్, అష్ట గ్రామం

వైద్యసేవలు అందించాలి



ఆసుపత్రి భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. మాలాంటి బీదవారు మెరుగైన వైద్యం కోసం భైంసా, నిజామాబాద్‌కు వెళ్లలేకపోతున్నాం. త్వరగా ప్రభుత్వ ఆసుపత్రి భవనం నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– నాగేష్, ముథోల్

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీఎం అశోక్

కుంటాల: స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలోని శ్రీ సరస్వతి మండల సమాఖ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలవ్యాప్తంగా ఇచ్చిన రుణాల్లో 97శాతం వసూలు చేశామని తెలిపారు. వాయిదాలు తప్పకుండా రుణాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కోశాధికారి అనిత, కార్యదర్శి సురేఖ, సీసీ పెంటన్న, యూసుఫ్, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణంతో నీటి కష్టాలు



పనుల సమయంలో దెబ్బతిన్న భగీరథ పైపులైన్

- భగీరథ ప్రధాన పైపులైన్ ధ్వంసం కావడంతో ట్యాంక్‌కు చేరని నీరు
- దస్తురాబాద్‌లో పదిరోజులుగా సరఫరా కాని తాగునీరు

దస్తురాబాద్: మండల కేంద్రంలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులతో మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతింది. దీంతో దస్తురాబాద్‌లో 10 రోజులుగా భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా కాలనీల ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఉపాధి నిధులతో..

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండల కేంద్రంలో రూ.ఎనిమిది లక్షలతో 328 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పొక్లెయిన్‌తో తవ్వకాలు జరిపిస్తుండగా మిషన్ భగీరథ ట్యాంక్‌కు నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ 70 మీటర్ల మేర దెబ్బతింది. దీంతో ఆయా కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

శాఖల మధ్య కొరవడిన సమన్వయం..

పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో పనుల సమయంలో భగీరథ పైపులైన్ దెబ్బతింది. పనులు చేపట్టే ముందు సమాచారం ఇవ్వలేదని.. మంచినీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన పంచాయతీరాజ్ అధికారులే మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పేర్కొంటున్నారు. కాగా మరోవైపు పైపులైన్ పనులకు బడ్జెట్ కేటాయించబోమని పంచాయతీరాజ్ అధికారులు అంటున్నారు.

తాగునీటి కోసం ఇబ్బందులు



డ్రెయినేజీ నిర్మాణ సమయంలో భగీరథ పైప్‌లైన్ దెబ్బతినడంతో మా కాలనీకి తాగునీరు సరఫరా కావడం లేదు. దీంతో మేం ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మంచినీటి సమస్యను పరిష్కరించాలి. – డి.శ్రీనివాస్, దస్తురాబాద్

సమాచారం ఇవ్వలేదు

డ్రెయినేజీ నిర్మాణం గురించి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను ధ్వంసం చేశారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాక మరమ్మతులు చేపట్టలేదు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తాం.

– హరీశ్, డీఈ, మిషన్ భగీరథ

నిధులు కేటాయించలేం

డ్రెయినేజీ నిర్మాణం సమయంలో భగీరథ పైప్‌లైన్ తొలగించాల్సి వచ్చింది. పైప్‌లైన్ కోసం నిధులు కేటాయించేందుకు మాకు అనుమతి లేదు. గ్రామ పంచాయతీలో నిధులు ఉంటే ఉన్నతాధికారుల అనుమతితో పైప్‌లైన్ వేస్తాం.

– లవకుమార్, పంచాయతీరాజ్ ఏఈ

మద్యం పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో తోకల రాజశేఖర్‌కు చెందిన బెల్ట్‌షాపులో పోలీసులు దాడిచేసి మద్యం పట్టుకున్నారు. ఎస్సై రాజు వివరాల ప్రకారం.. మన్మద్‌లో రాజశేఖర్ ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు చేసి రూ.7000 విలువ గల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వివరించాడు. రాజశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపాడు.

వంజర్‌లో..

నిర్మల్: సారంగపూర్ మండలంలోని వంజర్ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై ఎస్సై చంద్రమోహన్ సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశాడు. 24 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు అడెల్లి హుండీ ఆదాయం లెక్కింపు

నిర్మల్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సారంగపూర్ మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ హుండీని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ ఇంఛార్జి ఈఓ రంగు రవికిషన్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే లెక్కింపు కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల భక్తులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రారంభోత్సవానికి ఆహ్వానం

ఖానాపూర్: పట్టణంలో నూతనంగా నిర్మించిన గాయత్రి బ్రాహ్మణ సంఘం భవన ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ ఆ సంఘ నాయకులు మంగళవారం మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంకు ఆహ్వానపత్రిక అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆహ్వానం అందించి సన్మానం చేశారు. సంఘం నాయకులు కీర్తి రాఘవశర్మ, పిసుపాటి రేవంత్, ప్రవీణ్, శరత్ చంద్రశర్మ, తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎంపికైన విజేశ్

నిర్మల్: సారంగపూర్ మండలంలోని చించోలి(బి) జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థి చాట్ల విజేశ్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 నుంచి ఏప్రిల్ 1వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరగబోయే సాఫ్ట్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోటీలకు ఎంపికైన విజేశ్‌ను హెచ్‌ఎం రమేశ్, సిబ్బంది అభినందించారు.

ఆలయ కమిటీ కార్యవర్గం

కుభీర్: మండలకేంద్రంలోని శ్రీ విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీని మంగళవారం గ్రామస్తులు ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బి.పెంటాజి, ఉపాధ్యక్షుడిగా సూది రాజన్న, కోశాధికారిగా బచ్చు ప్రసాద్, మరో 25మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. కులసంఘాల నుంచి ఒక్కొక్కరిని సభ్యులుగా తీసుకున్నారు.

పరామర్శ

కుంటాల: మండలంలోని అందాకూర్ గ్రామంలో కట్బోళ్ల మోహన్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంగల్‌రావు, లక్ష్మణ్‌పటేల్, సృజన్, శ్రీను ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం ప్రారంభం



ఉత్సవమూర్తి విగ్రహంతో భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని ఉత్తరవాహినీ గోదావరి తీరంలో ఉన్న శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజైన మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం జోగుఎత్తుట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎల్లమ్మతల్లి ఉత్సవమూర్తి విగ్రహంతో బైండ్లోళ్ల డప్పుచప్పుళ్ల నడుమ ఇంటింటా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఒల్లాల చిన్న నర్సాగౌడ్, బుర్ర రాజారాం గౌడ్, శంకర్‌గౌడ్, దుర్గం వెంకాగౌడ్ ఉన్నారు.

తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలి



మున్యాలలో సీమంతం నిర్వహిస్తున్న సిబ్బంది

దస్తురాబాద్: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మున్యాల, దస్తురాబాద్, మున్యాలతండా, ఎర్రగుంట గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణదేవి, జ్యోతి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం కార్యవర్గం



నూతన కార్యవర్గం

ముథోల్: మండలకేంద్రంలోని పశుపతినాథ్ శివాలయ ప్రాంగణంలో తెలంగాణ జేఏసీ ఉద్యమకారుల ఫోరం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. తెలంగాణ జేఏసీ ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడిగా సోన్‌కామ్లే దిగంబర్, ఉపాధ్యక్షుడిగా బండారి సాయినాథ్, కార్యదర్శిగా సంధూరి యాదవ్, సహా కార్యదర్శిగా తాటోళ్ల దశరథ్, కోశాధికారిగా తొడ్కుర్ గోవింద్ పటేల్, సలహాదారులుగా వరగంటి ప్రకాశ్, గుంజాల నారాయణ, సభ్యులుగా ఉమాకాంత్, శంకర్, ప్రవీణ్, పండరి, వీరాచారి, భోజన్న, గంగాధర్, టి.సాయినాథ్, కే.గంగాధర్, బి.హన్మాండ్లు, కే.నారాయణ, గంగాధర్, లింగన్న, గంగాధర్, సాయినాథ్, దినేశ్, మణికంఠ, లక్ష్మణ్, సాయన్నను ఎన్నుకున్నారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీజేఏస్ ఉద్యమకారుల ఫోరం నాయకులు రోళ్ల రమేశ్, అధ్యక్షులు పండిత్‌రావు, ఉద్యమ చరిత్ర రచయితలు సామ జనార్దన్‌రెడ్డి, పుండలిక్‌రావు, పీసర శ్రీనివాస్, బస్వరాజ్, ఆసంవార్ సాయినాథ్ తదితరులు ఉన్నారు.

కుంటను పరిశీలించిన అధికారులు



కుంటను పరిశీలిస్తున్న చైర్మన్, అధికారులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల బొడ్డోని కుంట సమస్యపై కాలనీవాసుల విన్నపం మేరకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ఎమ్మెల్యే బొజ్జు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలతో తహసీల్దార్ శివరాజ్, ఇరిగేషన్ ఏఈఈ నవీన్ మంగళవారం మున్సిపల్ చైర్మన్‌తో కలిసి కుంటను సందర్శించారు. కుంటలో మురుగునీరు దుర్వాసన వస్తుందని కాలనీవాసులు విన్నవించారు. కుంటలోని మురికి నీటిని ఖాళీ చేయించడంతోపాటు ఖానాపూర్ శివారులోని రెంకోనివాగు ద్వారా నీటిని మళ్లించి కుంటను శుభ్రం చేయిస్తామని అధికారులు పేర్కొన్నారు. మురుగునీరు కుంటలోకి రాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్, వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు తొంటి శ్రీనివాస్, పరిమి సురేశ్, శంకర్, నాయిని సంతోశ్ ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేశ్

సోన్: ఎండలు పెరుగుతున్నందున నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ఎంపీడీవో సురేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ గ్రామంలోని నర్సరీని ఎంపీడీవో పరిశీలించి మాట్లాడారు. వేసవిలో మొక్కలకు మూడు పూటల నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పాక్‌పట్లలో చలివేంద్రం ప్రారంభించారు. కార్యదర్శులు సంగీత, సంధ్యారెడ్డి, పారిశుద్య కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయమందిస్తాం



పరామర్శిస్తున్న మహిళా సంఘ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ ఎస్సీ కాలనీకి చెందిన ఓ నిరుపేద కుటుంబం పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో ఈనెల 26న మంగళవారం ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు శీర్షికన ప్రచురితమైన కథనానికి మహిళా సంఘ సభ్యులు స్పందించారు. పట్టణంలోని ఝాన్సీ లక్ష్మి మహిళా మండలి సభ్యులు జక్కుల గంగామణి, సుందిళ్ల లక్ష్మి, జక్కుల గంగులు పట్టణ శివారులోని మామిడి తోటలో ఉన్న బాధిత కుటుంబం వద్దకు వెళ్లి పరామర్శించారు. కుటుంబీకుల సమస్యలను తెలుసుకున్నారు. మంచం పట్టిన కుమారుడి ఆరోగ్యం మెరుగుపడేలా చూడడంతోపాటు బాధిత కుటుంబానికి ప్రభుత్వం సాయం అందించేలా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు



రంగులు పూసుకుంటున్న మహిళలు

కుంటాల: స్థానిక శ్రీ సరస్వతి మండల సమాఖ్య సంఘ భవనంలో స్వయం సహాయక సంఘాల మహిళలు మంగళవారం ఘనంగా హోలీ వేడుకలను జరుపుకొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సీసీలు పెంటన్న, యూసుఫ్, స్త్రీ నిధి అసిస్టెంట్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

'పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి'



కరపత్రాలు విడుదల చేస్తున్న గంగన్న

లక్ష్మణచాంద: బీడీ పరిశ్రమలో పని చేసే కార్మికులు, బీడీ ప్యాకర్లు, బీడీ చాటర్స్, గంపవాలా, బట్టీవాలా కార్మికులకు ఏప్రిల్ 1నుంచి కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న కోరారు. మంగళవారం మండలంలోని చింతల్‌చాందలో కరువుభత్యానికి సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కొన్ని కంపెనీల యాజమాన్యాలు పెరిగిన కరువుభత్యం అమలు చేయకుండా చేసే కుట్రలను మానుకోవాలన్నారు. పెరిగిన కరువు భత్యంతో బీడీలకు కూలి రూ.245.8, బీడీ చాటర్లకు నెలకు రూ.339, ప్యాకింగ్ కార్మికులకు ఒక్కరోజుకు లక్ష బీడీలు ప్యాకింగ్ చేస్తే రూ.11.30 కలపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రజిత, స్వప్న, శారద, నర్సయ్య, రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.